ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 289 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 21 మే 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

డేంజర్‌లో 'శ్రీశైలం డ్యాం'

100 కోట్లు అవసరం అంటున్న నిపుణులు

ఆనకట్ట భద్రతకు నిధుల కొరత

మే 21 (రిపబ్లిక్ న్యూస్): శ్రీశైలం ఆనకట్ట భద్రతకు నిధుల కొరత వెంటాడుతోంది. 15 సంవత్సరాల కిందట వరద పోటెత్తడంతో కట్ట దిగువభాగం, అప్రోచ్‌రోడ్డు కోతకు గురయ్యాయి. మరమ్మతులకు అవసరమైన నిధుల కేటాయింపుపై ప్రభుత్వాలు దృష్టిపెట్టకపోవడం శాపంగా మారాయి. సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న డ్రిప్ పథకం కింద పైసా రాలేదు. ఒకట్రెండు రోజుల్లో పరిశీలనకు సెంట్రల్ వాటర్ కమిషన్ ప్రతినిధులు వస్తున్నట్లు ఇంజినీర్లు పేర్కొంటున్నారు. వారిచ్చే నివేదికలతో అయినా ప్రభుత్వాల్లో కదలికొస్తేనే శ్రీశైలం జలాశయం భద్రతకు భరోసా లభిస్తుంది.

పి.నజీర్ అహమ్మద్ కర్నూలు బ్యూరో

రూ.100 కోట్లు అవసరం

2009 వరదలకు తీవ్రస్థాయిలో దెబ్బతిన్న శ్రీశైలం ఆనకట్ట భద్రత, పునరుద్ధరణ కోసం రూ.100 కోట్లైనా అవసరమవుతుంది. కుడిగట్టు వైపు అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణకే రూ.43.60 కోట్లు అవసరమని ఇంజినీర్లు మూడు సంవత్సరాల కిందటే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆనకట్ట దిగువన ఏప్రాన్ బలోపేతం, విస్తరణ కోసం మరో రూ.41.30 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. స్పిల్‌వే రక్షణ, కుడి, ఎడమ వైపు కొండ చరియలను సరిచేయడానికి నిధులు అవసరమని కోరారు.

కుడిగట్టు వైపు ఏప్రాన్‌కు వెళ్లే మార్గంలో కొట్టుకుపోయిన కొండ చరియలు

పనికొచ్చే పనులకు పైసా ఇవ్వలే: 2009లో పోటెత్తిన వరదలకు శ్రీశైలం డ్యాం కుడివైపు కొండచరియలు, అప్రోచ్‌రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఆనకట్ట స్పిల్‌వే ఎదురుగా ఉన్న ఏప్రాన్ ముందు దృఢమైన బండపరుపు కొంతవరకు కొట్టుకుపోయింది. వీటిని పునరుద్ధరించాలని అప్పట్లోనే నిపుణులు సూచనలు చేసినా పట్టించుకోలేదు కుడిగట్టు కొండ చరియలకు (ఆనకట్టకు పక్కన) ఆనుకొని ఉన్న అప్రోచ్ రోడ్డు వరదలకు కొట్టుకుపోయింది. పునరుద్ధరణకు ఇంతవరకు చిల్లిగవ్వ విడుదల చేయలేదు. అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణ జరిగితేనే మరమ్మతులకు అవసరమైన వస్తువులు, యంత్ర సామగ్రిని ఏప్రాన్ వద్దకు తీసుకెళ్లేందుకు ఆస్కారం ఉంటుంది.

డ్రిప్ – ఉప్

దేశంలోని అన్ని డ్యాం భద్రత కోసం కేంద్ర జల వనరుల శాఖ 2020లో ఆనకట్టల పునరుద్ధరణ, మెరుగుదల ప్రాజెక్టు (డ్రిప్) పథకాన్ని అమలు చేసింది. శ్రీశైలం ఆనకట్టకు ఇచ్చేందుకు సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) ఆమోదం తెలిపింది. ప్రపంచ బ్యాంకు నిధులొస్తాయని 2020లో ఏపీ సర్కార్ స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ కింద అకౌంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. సీడబ్ల్యూసీ మాజీ ఛైర్మన్ ఏబీ పాండ్య ఆధ్వర్యంలో ఏర్పాటైన జాతీయ నిపుణుల కమిటీ ప్రతినిధులు 2021, 2022లో రెండుసార్లు శ్రీశైలం ఆనకట్టను సందర్శించి నివేదికలు సిద్ధం చేశారు. వాటి ప్రకారం ఆనకట్ట ఇంజినీర్లు ప్రతిపాదనలు సమర్పించారు. ఇంతవరకు డ్రిప్ నిధుల ఊసే లేకుండాపోయింది.

ప్రమాదంలో శ్రీశైలం ప్రాజెక్టు - స్పిల్ వే వద్ద భారీ గొయ్యి - జారిపోతున్న కొండ గట్లు

'శ్రీశైలం ప్రాజెక్టుపై నిర్లక్ష్యం ఎందుకు?': శ్రీశైలం పైన నిర్లక్ష్యం ఎందుకు అని జాతీయ డ్యాం భద్రతా అథారిటీ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొండ గట్లు జరిపోతున్నాయని అంటున్న పట్టించు కోవడం లేదు అని అంటున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకున్నారని పరిశీలకులు చెబుతున్నారు. ఎంత తొందరగా ఈ పనులు చేపడితే డ్యామ్ సేఫ్టీ గా ఉంటుంది అని అంటున్నారు.

ఆమె ఉగ్రవాదా లేక హంతకురాలా..?

పూజా ఖేడ్కర్ కేసులో సుప్రీం ప్రశ్న

మాజీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్ బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది.

దిల్లీ, మే 21, (రిపబ్లిక్ న్యూస్): అధికార దుర్వినియోగం, తప్పుడు ధ్రువపత్రాల సమర్పణ వ్యవహారంలో ఆ మధ్య ఐఏఎస్ మాజీ ప్రొబేషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. బుధవారం అత్యున్నత న్యాయస్థానం ఆమెకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

ఆమె చేసిన తీవ్రమైన నేరం ఏమిటని పోలీసులను ప్రశ్నించింది. 'ఆమె డ్రగ్ లార్డ్.. ఉగ్రవాది కాదు. ఎటువంటి హత్యా చేయలేదు. కేసు తీవ్రతను పరిశీలిస్తే కేసు వాస్తవాలను, పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని.. పిటిషనర్కు దిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరుచేసి ఉండాల్సింది. ఎందుకంటే ఇప్పుడు ఆమె అన్నీ కోల్పోయింది. ఎక్కడా ఆమెకు ఉద్యోగం దొరికే అవకాశం లేదు. ఈ కేసుపై దర్యాప్తును త్వరగా పూర్తిచేయండి. విచారణకు సహకరించేలా ఆమెను ఆదేశిస్తాం" అని పేర్కొంది. కాగా అత్యున్నత న్యాయస్థానం ఖేడ్కర్కు ముందస్తు బెయిల్ మంజూరుచేయడాన్ని దిల్లీ పోలీసులు తరపు న్యాయవాది తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమెపై వచ్చిన ఆరోపణలు చాలా తీవ్రమైనవి.. దర్యాప్తునకు కూడా ఖేడ్కర్ సహకరించట్లేదని కోర్టుకు విన్నవించారు. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ.. ఆమెను ముస్సోరిలోని లాల్బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించింది. నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించిన యూపీఎస్సీ దానిపై వివరణ ఇవ్వాలని ఆమెకు షోకాజ్ నోటీసులిచ్చింది. ఆమెపై ఫోర్జరీ కేసు నమోదు చేయడంతో పాటు అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. తాను ఏ పత్రాలను ఫోర్జరీ చేయలేదని తెలిపారు. యూపీఎస్సీకి తనపై అనర్హత వేటు వేసే అధికారం లేదని వాదించినప్పటికీ.. ఆమెకు నిరాశే ఎదురైంది. గతేడాది ఆగస్టులో ఆమె ముందస్తు బెయిల్కు హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం ఆమెకు మధ్యంతర రక్షణ కల్పిస్తూ వచ్చింది. తాజాగా ఈ కేసుపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

యోగాకు గుర్తింపు తెచ్చిన వ్యక్తి ప్రధాని మోదీ:సీఎం చంద్రబాబు

యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు.

అమరావతి, మే 21, (రిపబ్లిక్ న్యూస్): యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఉండవల్లిలో 'యోగాంధ్ర' వెబ్సైట్ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో నిర్వహించుకునే కార్యక్రమం యోగా అన్నారు. ఇది కొద్ది మందికో, కొన్ని ప్రాంతాలకో పరిమితమైంది కాదని.. ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్ప వరమని పేర్కొన్నారు. అందరి జీవితాల్లో యోగా భాగం కావాలన్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం కావాలంటే దీన్ని సాధన చేయాలని సూచించారు. "ఫొటోలు, ఈవెంట్ కోసం ఒకరోజు చేసే కార్యక్రమం కాదిది. ప్రతిఒక్కరిలో ప్రగాఢమైన మార్పు తీసుకొచ్చే కార్యక్రమమిది. జీవనశైలిలో భాగమయ్యేలా యోగాను ముందుకు తీసుకెళ్లాలి. నేటి నుంచి నెలపాటు యోగాంధ్ర-2025 నిర్వహిస్తున్నాం. కనీసం 2 కోట్ల మందికి తక్కువ కాకుండా పాల్గొనాలన్నది సంకల్పం. కనీసం 10 లక్షల మందికిపైగా యోగా సర్టిఫికెట్లు ఇవ్వాలనేది లక్ష్యం. జూన్ 21న విశాఖలో 5 లక్షల మందితో ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు కార్యక్రమం చేపడతాం. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం నిర్వహిద్దాం. విశాఖలో జరిగే యోగా ఈవెంట్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారు. పాఠశాలల్లోనూ ఇక నుంచి రోజూ ఒక గంట యోగా ఉంటుంది" అని చంద్రబాబు తెలిపారు.

మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మృతి చెందారు.

బీజాపూర్, మే 21, (రిపబ్లిక్ న్యూస్): ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్షా ఎక్స్లో వెల్లడించారు. బుధవారం ఉదయం జరిగిన ఎన్కౌంటర్లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ.1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు.

గణపతి తర్వాత పార్టీ పగ్గాలు

ఎన్ కౌంటర్లో మరణించిన నంబాల కేశవరావు మరో పేరు బసవరాజు. మావో సెంట్రల్ మిలిటరీ కమిషన్ చీఫ్ గా ఉన్నారు. 2018 నవంబర్లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి రాజీనామా తర్వాత అతను పార్టీకి సుప్రీం కమాండర్ అయ్యాడు. కేశవరావుది శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామం. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. కేశవరావు ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరు అయిన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య, టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఆయన రెండో సంవత్సరం డిగ్రీ చదువుతుండగా వరంగల్ లోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాలలో సీటు రావడంతో అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యారు. ఆ తర్వాత ఉద్యమ బాట పట్టారని గ్రామస్థులు చెబుతారు. ప్రజా సేవంటే మొదటి నుంచీ మక్కువని, తాము ఎన్ని విధాలుగా నచ్చజెప్పినా తిరిగి ఉద్యమాల్లోకి వెళ్లాడని స్థానికులు పేర్కొన్నారు.

నంబాల కేశవరావు

కుప్పంలో ప్రసన్న తిరుపతి గంగమ్మకు సారె సమర్పించిన చంద్రబాబు దంపతులు

ఏపీ సీఎం చంద్రబాబు కుప్పంలో పర్యటిస్తున్నారు. సతీమణి నారా భువనేశ్వరితో కలిసి ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో ఆయన పాల్గొన్నారు.

కుప్పం, మే 21, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ సీఎం చంద్రబాబు కుప్పంలో పర్యటిస్తున్నారు. సతీమణి నారా భువనేశ్వరితో కలిసి ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో ఆయన పాల్గొన్నారు. సీఎం దంపతులకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారి విశ్వరూప దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు దంపతులు సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రానికి మంచి జరగాలని సీఎం ప్రార్థించారు. మరోవైపు అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. ఏడాదికి ఒకసారి మాత్రమే ఈ దర్శనం కల్పిస్తారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రతి అక్షరం ప్రజల కోసం

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1502 :** సెయింట్ హెలెనా దీవిని పోర్చుగీస్ కి చెందిన నౌకాదళాధికారి అడ్మిరల్ జోయో డా నోవా కనుగొన్నాడు.
- **1829 :** సికింద్రాబాదు కు ఆ పేరు రావటానికి కారణమైన సికిందర్ జా అసఫ్ జాహి మరణం (జ.1768).
- **1886 :** ప్రాణవాయువు ను కనుగొన్న శాస్త్రవేత్త కార్ల్ విల్‌హెల్మ్ షీలే మరణం (జ.1742).
- **1937 :** ఆర్కిటిక్ మహాసముద్రం మంచు ఖండాల మీద సోవియట్ రష్యా తన మొట్టమొదటి వైజ్ఞానిక పరిశోధక కేంద్రం మొదలు పెట్టింది.
- **1991 :** భారత 6వ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ మరణం (జ.1944). (చిత్రంలో)
- **1994 :** భారత దేశానికి చెందిన సుష్మితా సేన్ 18 సంవత్సరాల వయసులో, 43వ విశ్వ సుందరిగా ఎన్నికైంది.

కబీరుదాసు

వాస్కోడిగామా

క్రిస్టోఫర్ కొలంబస్

తూనికలు, కొలతల దినోత్సవం

క్యూబా

బిపిన్ చంద్ర పాల్

కేన్స్‌లో తొలిసారి మెరిసిన జాన్వీ.. ఫొటోలు వైరల్

నటి జాన్వీకపూర్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. తన లుక్‌తో అందరినీ ఆకర్షించారు.

తారల సందడితో 78వ కేన్స్ చిత్రోత్సవాలు కోలాహలంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈనెల 13న ప్రారంభమైన ఈ సినీ వేడుక 24 వరకు జరగనుంది. ఈ ఫిల్మ్ ఫెస్టివల్లో ఇప్పటికే కొందరు నటీనటులు అరంగేట్రం చేసి ఆకట్టుకున్నారు. తాజాగా నటి జాన్వీకపూర్ తొలిసారి కేన్స్‌లో మెరిశారు. తన లుక్ తో అందరి శ్రీదేవిని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆమె కేన్స్ లుక్కు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి. పొడవాటి రెడ్ గౌన్ను ధరించిన జాన్వీ రాచరికం ఉట్టిపడేలా రెడ్ కార్పెట్ పై హొయలొలికించారు. ఆమెతో పాటు 'హామ్ బౌండ్ చిత్రబృందం కూడా కేన్స్కు హాజరైంది. కార్పెట్ పై జాన్వీకి ఇషాన్ ఖట్టర్ సాయం చేయడం దృష్టిని ఆకర్షించింది. జాన్వీ లుక్ చూసినవారంతా శ్రీదేవి గుర్తుకు వస్తున్నారంటూ కామెంట్స్ పెడుతున్నారు. ఇషాన్ ఖట్టర్, జాన్వీ కపూర్ జంటగా నీరజ్ మైవాన్ తెరకెక్కించిన 'హామ్ బౌండ్ సినిమాని ఆ వేడుకలో ప్రదర్శించనున్నారు. ఈ ఏడాది కేన్స్కు ఎంపికైన ఏకైక భారతీయ చిత్రం ఇదే కావడం విశేషం. ఇది టీమ్కు దక్కిన గౌరవం అని జాన్వీ అన్నారు. దీనికోసం చిత్రబృందమంతా అక్కడికి చేరుకుంది.

పుస్తకంగా మోహన్లాల్ జీవిత చరిత్ర.. పుట్టినరోజు నాడు గుడ్న్యూస్ చెప్పిన నటుడు

తన జీవిత చరిత్ర పుస్తక రూపంలో రానున్నట్లు మోహన్లాల్ తెలిపారు. డిసెంబర్ 25న దీన్ని విడుదల చేయనున్నారు.

అరవైల్లోనూ కుర్ర హీరోలతో పోటీపడుతూ.. బాక్సాఫీస్ లెక్కల్లో రికార్డులు సృష్టిస్తున్నారు అగ్ర కథానాయకుడు మోహన్ లాల్. వరుస సినిమాలతో మలయాళ ఇండస్ట్రీలో సరికొత్త చరిత్రను లిఖిస్తున్నారు. నేడు ఈ టాలెంటెడ్ హీరో 65వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈసందర్భంగా అభిమానులకు ఒక గుడ్న్యూస్ చెప్పారు. తన జీవిత చరిత్రను పుస్తకరూపంలో అందించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను పంచుకున్నారు. ముఖరాగం పేరుతో తన జీవిత చరిత్ర పుస్తకం రానున్నట్లు మోహన్లాల్ తెలిపారు. "నా పుట్టినరోజు సందర్భంగా మీతో కొన్ని అద్భుతమైన విషయాలను పంచుకోవాలనుకుంటున్నాను. నా జీవితంలో జరిగిన ముఖ్యమైన విషయాలకు రచయిత భానుప్రకాశ్ అక్షరరూపం ఇచ్చారు. 'ముఖరాగం' పేరుతో ఈ పుస్తకం రానుంది. దీనికి మలయాళంలో నాకు అత్యంత ఇష్టమైన రచయిత వాసుదేవన్ నాయర్ ముందుమాట రాశారు. ఇందులో గత 47 సంవత్సరాల నా నట జీవితంలో జరిగిన ఎన్నో అంశాల గురించి వివరించారు. నా జీవిత చరిత్ర పుస్తకం రూపంలో రావాలని ఎంతోమంది కలలు కన్నారు. అవి ఇప్పుడు నిజమవుతున్నాయి. దాదాపు వెయ్యి పేజీల ఈ పుస్తకం డిసెంబర్ 25న విడుదల కానుంది" అని చెప్పారు. ఇక ఇందులో మోహన్లాల్ నటనా ప్రయాణంతో పాటు.. ఆయన జీవితంలో జరిగిన ఎన్నో విషయాల గురించి వివరించారు. నిర్మాత, బ్రాండ్ అంబాసిడర్, లెఫ్టినెంట్ కల్నల్గా.. ఇలా మోహన్లు సంబంధించిన ముఖ్యమైన అంశాల గురించి రాశారు. ఆయన కుటుంబ చరిత్ర, బాల్యం, కెరీర్ ప్రారంభం, ఆయనలో స్ఫూర్తినింపిన వ్యక్తుల గురించి వివరించారు. 1960లో జన్మించిన మోహన్లాల్ 1978లో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ప్రయోగాత్మక చిత్రాలతో స్టార్గా ఎదిగారు. తన అద్భుతమైన నటనకు గాను ఐదుసార్లు జాతీయ అవార్డు అందుకున్నారు. తన కెరీర్ గురించి మోహన్లాల్ పలు సందర్భాల్లో చెప్పిన విశేషాలివి..

నలభై ఎనిమిదేళ్ల కెరీర్లో నేను సినిమాను ప్రేమించినంతగా దేన్నీ ప్రేమించలేదు. ఒక సినిమా సెట్స్ మీద ఉండగానే నాలుగైదు చిత్రాలకు ఓకే చెబుతుంటా. 'మరీ అంత రిస్క్ అవసరమా అంటుంటారు ఇంట్లో వాళ్లు. నిజానికి నాకు విశ్రాంతి తీసుకోవడం, ఖాళీగా ఉండటమంటే అస్సలు నచ్చదు. చిన్నప్పట్నుంచీ భారత సైన్యం అంటే ఎనలేని గౌరవం. అటువైపు వెళ్లకపోయినా సైనికుల జీవితాన్ని తెరమీద చూపాలనే ఉద్దేశంతో 'కీర్తిచక్ర', 'కురుక్షేత్ర' తదితర సినిమాలు తీశా.

నాకు ఎన్టీఆర్, ఏఎన్నార్ అంటే చాలా గౌరవం. ఎన్టీఆర్ నటుడిగానూ, ముఖ్యమంత్రిగానూ ఆయా రంగాల్లో తనదైన ముద్ర వేశారు. పేదల కోసం ఎంతో తపన పడ్డారు. ఏఎన్నార్తో 'గాండీవం' లో నటించడం ఓ గొప్ప అనుభూతి. ఇప్పటికీ తెలుగు రాష్ట్రాలకు వస్తే చాలామంది 'గోరువంక వాలగానే గోకులానికి...' పాటను గుర్తు చేసుకుంటారు. ఆ సమయంలో బాలకృష్ణ, ఏఎన్నార్లతో స్టెప్పులు వేసిన రోజులు కళ్లలో మెదులుతాయి.

రిపబ్లిక్ సినిమా CINEMA

సరికొత్తగా 'శక్తిమాన్'.. నేటి యువత ఇష్టపడే ఫార్మాట్లో..

1990లలో అత్యంత ప్రజాదరణ పొందిన టెలివిజన్ షో శక్తిమాన్. ముఖేశ్ ఖన్నా ప్రధాన పాత్రలో నటించిన ఇది భారత్లోనే మొదటి సూపర్ హీరో సిరీస్. ఇప్పుడు మరోసారి నేటితరాన్ని అలరించడానికి సిద్ధమైంది. సరికొత్త ఫార్మాట్లో ముఖేశ్ ఖన్నా వచ్చేస్తున్నారు. ఆడియో సిరీస్లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. దీనికి ముఖేశ్ ఖన్నా వాయిస్ ఓవర్ ఇవ్వనున్నారు. దీనిపై ఆయన ఆనందం వ్యక్తంచేశారు. "శక్తిమాన్ కేవలం ఓ షో మాత్రమే కాదు. ఇది కొన్ని మిలియన్ల మందికి ఎమోషన్. మరోసారి దీన్ని ప్రేక్షకులకు అందిస్తున్నందుకు ఆనందంగా, గర్వంగా ఉంది. నేటితరానికి అనుగుణంగా పాకెట్ ఎఫ్ఎంలో ఆడియో సిరీస్ రూపంలో అందించనున్నాం. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఇయర్ఫోన్స్లో ఇప్పుడు శక్తిమాన్ను ఎంజాయ్ చేయండి. శక్తిమాన్ విలువలు, అతడి బలం, సూపర్ పవర్ను తిరిగి పరిచయం చేయడానికి ఈ ప్లాట్ఫామ్ గొప్ప మార్గాన్ని కనుగొంది. నేటి యువత ఇష్టపడే ఫార్మాట్లో కొత్త కథలతో మీ ముందుకు వస్తుంది" అని చెప్పారు. 1997 నుంచి 2005 వరకూ శక్తిమాన్ దూరదర్శన్లో ప్రసారమైంది. ఇప్పుడు దీన్నే ఆడియో రూపంలో అందించనున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక

9948814188, 9985876888

ప్రకటన

ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501

డోర్ నెం:46/181/జి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001

రిపబ్లిక్ స్పోర్ట్స్

యువ ఆటగాళ్లు ఒత్తిడికి గురి కావొద్దు : ఎంఎస్ ధోని

రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ అనంతరం..

ఎంఎస్ ధోని యువ క్రికెటర్లకు పలు సలహాలు, సూచనలు ఇచ్చాడు.

ఐపిఎల్ 2025 సిజన్లో భాగంగా మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్లో రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. రాజస్థాన్ 17.1 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్ అనంతరం ధోని యువ క్రికెటర్లకు పలు సలహాలు, సూచనలు ఇచ్చాడు. 'మీ మీద అంచనాలు పెరిగినప్పుడు ఒత్తిడికి గురికావొద్దు. సీనియర్ ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది నుంచి నేర్చుకోండి. యువ ఆటగాళ్లు 200 ప్లస్ స్ట్రైక్రేట్తో పరుగులు చేయాలనుకున్నప్పుడు, బ్యాటింగ్లో నిలకడ కొనసాగించడం కష్టమే. అయినా మ్యాచ్లో లో ఏ దశలో అయినా సిక్స్ లు కొట్టగల సామర్థ్యం వారి సొంతం' అని మ్యాచ్ అనంతరం ధోని అన్నాడు. అలాగే మ్యాచ్లో తమ టీమ్ ప్రదర్శన గురించి కూడా మాట్లాడాడు. 'మేం ప్రత్యర్థి జట్టు ముందు మంచి లక్ష్యమే ఉంచాం. కానీ మ్యాచ్ ఆరంభంలో త్వరత్వరగా వికెట్లు కోల్పోవడంతో లోయర్, మిడిల్ ఆర్డర్పై ఒత్తిడి పడింది. బ్రెవిస్ చక్కటి ఇన్నింగ్స్ ఆడాడు. అతడు బ్యాటింగ్ చేస్తున్నప్పుడు రన్రేట్ చక్కగా ఉంది. కానీ మేం మొదట్లోనే వికెట్లు కోల్పోవడంతో దాన్ని కొనసాగించలేకపోయాం. పేసర్ కాంబోజ్ చక్కగా బౌలింగ్ చేశాడు. మనం ఊహించిన దానికంటే అతడి బంతులు మనల్ని వేగంగా తాకుతాయి. పవర్లోలో మూడు ఓవర్లు బౌలింగ్ చేయడమంటే అంత తేలిక కాదు. కానీ కాంబోజ్ బాగా బౌలింగ్ చేశాడు' అని ఎంఎస్ ధోని వివరించాడు. చెన్నై సూపర్ కింగ్స్ మే 25న ఈ సీజన్లో తన చివరి మ్యాచ్ ఆడనుంది. అహ్మదాబాద్ వేదికగా జరగనున్న ఆ మ్యాచ్లో చెన్నై, గుజరాత్ టైటాన్స్తో తలపడనుంది. ఇందులో ధోని సేన నెగ్గి, విజయంతో సీజన్ ముగించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

ఇంటి చిట్కాలు

టెస్ట్ చేయకుండానే షుగర్ వచ్చిందని కొన్ని లక్షణాలని బట్టి తెలుసుకోవచ్చు, నెగ్లెక్ట్ చేస్తే కష్టమే మరి

డయాబెటిస్ నూటిలో దాదాపు 80 శాతం మంది నేటికాలంలో దీని బారిన పడుతున్నారు. సరిలేని లైఫ్‌స్టైల్ కారణంగానే ఈ సమస్య మనల్ని పట్టి పీడిస్తోంది. ఈ సమస్య గురించి ముందునుంచే అవగాహన అనేది కచ్చితంగా ఉండాలి. కొన్ని లక్షణాలని బట్టి మనకి ఈ ప్రాబ్లమ్ ఉందని గుర్తించొచ్చు.

షుగర్.. ఇది వరకూ జలుబు, దగ్గు అనేది ఎలానో ఇది కూడా అలానే కామన్ ప్రాబ్లమ్‌గా మారింది. కానీ, ఇది కామన్ ప్రాబ్లమ్ కాదు చాలా కాంప్లికేటెడ్ ప్రాబ్లమ్. అందుకే, ఈ సమస్య విషయంలో ముందు నుంచీ జాగ్రత్తగా ఉండాలి. లక్షణాలను గమనిస్తూ మనల్ని మనం సమస్య రాకుండా కాపాడుకోవాలి. ఈ సమస్య కారణంగా ఇతర సమస్యలు కూడా వస్తాయి. కొన్నిసార్లు అవి ప్రాణాంతకరంగా మారతాయి. కాబట్టి, ముందునుంచే ఈ సమస్య రాకుండా జాగ్రత్త పడాలి. సరిలేని లైఫ్‌స్టైల్, వర్కౌట్ లేని రొటీన్, ఊరికే కూర్చుని ఉండడం, చెమట కూడా రాకుండా జీవించడం, జెనెటిక్స్ ప్రాబ్లమ్స్ వల్లే షుగర్ ఎక్కువగా వస్తుంది. ఇవి ఈ రోజుల్లో అందరి డెయిలీ లైఫ్‌స్టైల్ అని చెప్పొచ్చు. కష్టపడి పనిచేయడమనేది తగ్గింది. అందరూ ఇంటి పనులకి కూడా మెషిన్స్ వాడుతున్నారు. డెస్క్ జాబ్స్ ఈ కారణాలన్నింటీ వల్లే చాలా వరకూ శారీరక శ్రమ తగ్గి డయాబెటిస్ లాంటి సమస్యలొస్తున్నాయి. అయితే, ఈ సమస్య వచ్చాక బాధపడే బదులు రాక ముందే జాగ్రత్తగా ఉండాలి. కొంతమందికి ప్రాబ్లమ్ ఉందని కూడా తెలియదు. కానీ, మన బాడీలో వచ్చే కొన్ని లక్షణాల వల్ల డయాబెటిస్ వచ్చిందని టెస్ట్ చేయకుండానే తెలుసుకోవచ్చని చెబుతున్నారు న్యూట్రిషనిస్ట్ సిమ్రాన్ ఓహ్రా.



ఎక్కువసార్లు మూత్రం రావడం

ఇది ముఖ్యమైన లక్షణం. షుగర్ ఉన్నవారు ఎక్కువ సార్లు మూత్రానికి వెళ్లాల్సి వస్తుంది. అయితే, ప్రతీసారి అది షుగర్ అనే అనుమానించాల్సిన అవసరం లేకపోయినప్పటికీ షుగర్ ఉంటే మాత్రం ఈ ప్రాబ్లమ్ ఉంటుందని గుర్తుపెట్టుకోవాలి. ఎక్కువగా నీరు తాగకుండానే ఏ సీజన్‌లో అయినా ఎక్కువసార్లు మూత్రం వస్తుంటే ఒక్కసారి జాగ్రత్తపడండి. ఎందుకైనా మంచిది ఓ సారి డాక్టర్‌ని కలవడం మంచిది.

కష్టపడకుండానే బరువు తగ్గడం

బరువు తగ్గడానికి చాలా ప్రయత్నాలు చేస్తారు. అయితే, ఎలాంటి ప్రయత్నం లేకుండా బరువు తగ్గడం, ఒక్కసారిగా బాడీ తేలిగ్గా అనిపించడం కూడా షుగర్ ఉందని చెప్పే లక్షణమే. దీంతోపాటు కంటి చూపు తగ్గడం వంటివి కూడా షుగర్ ఉన్నట్లు తెలిపే లక్షణమే.

ఎక్కువగా ఆకలి

సాధారణ సమయాల్లో రెండు, మూడుసార్లు తినే మీరు ఊరికే ఎక్కువగా తినడం, ప్రతీసారి ఆకలిగా అనిపించడం కూడా సమస్య ఉందని చెప్పకనే చెప్పే లక్షణం. అప్పుడే తిన్నప్పటికీ మళ్లీ వెంటనే ఆకలిగా అనిపిస్తే సమస్య ఉందని అనుమానించాల్సిందే. ఇవన్నీకూడా ప్రారంభ దశలో కనిపించే లక్షణాలు వీటిని అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు.

నీరసంగా అనిపించడం

ఊరికే ఏ పని చేయకుండానే నీరసంగా అనిపించడం కూడా ఓ లక్షణమే. ఫుడ్ తీసుకున్నప్పటికీ అలసటగా ఉండడం, మత్తుగా అనిపించడం జ్వరం వంటివి లేకపోయినా అలసట అనిపించడం, ముఖ్యంగా రోజువారీ పనులు కూడా చేయలేకపోవడం, మెట్లు ఎక్కినా, చిన్న చిన్న బరువులు మోసినా ఆయాసంగా అనిపించడం ఇలాంటివన్నీ కూడా షుగర్ ఉందని అనుమానించాల్సిన విషయాలే.

గాయాలు మానడానికి సమయం

సాధారణంగా మనకి అయిన గాయాన్ని బట్టి అది తగ్గుతుంది. కానీ, చిన్న చిన్న గాయాలు తగ్గడానికి కూడా చాలా టైమ్ పట్టడం, అస్సలు తగ్గకపోతే కచ్చితంగా అనుమానించాల్సిందే. ఇలాంటి సమస్య ఉన్నప్పుడు ఓ సారి హెల్త్ చెకప్ చేసుకోవాలి. నిపుణులని కలిసి సమస్య ఏంటో అడిగి తెలుసుకోవడం ముఖ్యం. ఇలాంటి లక్షణాలన్నీ కూడా మొదట్లో కనిపించే లక్షణాలు. వీటిని అస్సలు నెగ్లెక్ట్ చేయొద్దు. ఇవి కనిపించిన వెంటనే నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

గమనిక: ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.